క్లుప్తంగా

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ



పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై బుధవారం డంపింగ్ యార్డు వద్ద మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పెదకూరపాడు మండల అభివృద్ధి అధికారి సాయి లీల మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల ఉద్దేశాన్ని వివరించారు. స్వచ్ఛమైన, పచ్చని గ్రామాలు లక్ష్యంగా గ్రీన్ అంబాసిడర్లు నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపదని తయారు చేసి పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంచాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



పెదకూరపాడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రాయపూడి సాంబశివరావు, బొర్రా హిమనిలను బుధవారం పెద్దకూరపాడు మండల విద్యా వనరుల భవనంలో ఉపాధ్యాయ మిత్రమండలి, గ్రామ పెద్దలు సత్కరించారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ.. ఇరువురు ఉపాధ్యాయులుగా విశేష సేవలు అందించారన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. క్రోసూర్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ గోపాల్ రావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పేరేచర్ల కోటేశ్వరరావు, పెదకూరపాడు, 75 తాళ్లూరు, గారపాడు, పాటిబండ్ల జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ, శ్రీనివాస్ రెడ్డి, శివ నాగేశ్వరరావు, విజయ రాణి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పేరేచర్ల దుర్గాప్రసాద్, సాంబశివరావు, నాయంతుల, బెల్లంకొండ శివశంకర్, శ్రీనివాస్ రెడ్డి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ తీరు పరిశీలన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ఎరువుల పంపిణీ తీరును జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఎరువుల అమ్మకం తీరును బుధవారం పరిశీలించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని తెలిపారు. సాగు చేసిన పంట స్థితిగతులపై రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సత్తెనపల్లి వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఏఈఓ ఎస్.శేషుబాబు, పావని, ఎంపీఈఓ భరత్, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రతిజ్ఞ



క్రోసూరు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు క్రోసూరులోని పీహెచ్‌సీలో గత రెండు రోజులుగా సీపీఆర్‌పై అవగాహన కల్పించినట్లు డాక్టర్ జాఫ్రిన్ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులకు సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యాంసన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి



నకరికల్లు: గ్రామాల్లో పచ్చదనం పెంపొందించి పారిశుద్ధ్యం మెరుగు పడటానికి గ్రీన్ అంబాసిడర్లదే కీలకపాత్ర అని మాస్టర్ ట్రైనీ నర్రా మమత అన్నారు. గ్రామ పంచాయతీలలో గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులకు బుధవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.కాశయ్య మాట్లాడుతూ తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరించి తరలించాలన్నారు. శిక్షణ అనంతరం నర్సిగపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ సేవకులు, గ్రీన్‌అంబాసిడర్లు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సురేష్, పంచాయతీ కార్యదర్శులు కొమ్మవరపు అప్పారావు, అబ్దుల్ అలీం, టి.మల్లికార్జునరావు, వసుంధర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి వేడుకలు

సత్తెనపల్లి: శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఆదర్శమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కలాం చిత్రపటానికి, రైల్వే స్టేషన్‌రోడ్ లో విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అబ్దుల్ కలాం కృషి సాటిలేనిదన్నారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అంటూ ఆ మహనీయుడు ఇచ్చిన పిలుపు యువతకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కలాం సేవలను వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ జానీ, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మాబూ హుస్సేన్ కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి అచ్యుత శివ ప్రసాద్, దివ్యాంగుల విభాగం జిల్లా కార్యదర్శి సయ్యద్ గోరా, నాయకులు షేక్ మొహమ్మద్ గని, షేక్ జలీల్, కరీం, షేక్ ఖాజా, రెడ్డిగూడెం కరిముల్లా, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి కృపావరం, కోడిరెక్క దేవదాస్, సిరిగిరి వెంకట్రావు, వల్లెం నరసింహారావు, తుమ్మల వెంకటేశ్వరరావు, ఖాశిం, చిలుకా రమణయ్య, ఉల్లంఘుల ప్రసాద్ బాబు, యర్రం లక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో...

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద బుధవారం జయంతి వేడుకలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సభ్యుడు ప్రతాప్ సింహ శాస్త్రి మాట్లాడుతూ కలాం సేవలు ఎనలేనివి అన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు మాట్లాడుతూ కలాం వంటి వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసే అదృష్టం తనకు లభించిందన్నారు. మాధంశెట్టి వేదాద్రి, అన్నం కృష్ణ, దేవరశెట్టి రవి కుమార్ చదవాలి చిన్న సత్యనారాయణ ఆళ్ల శేఖర్, మోటమర్రు రాంబాబు, ఆనంద్, కృష్ణమోహన్, పెండ్యాల హరేరామ్, కాపుగంటి శ్రీవెంకటరత్నం, జొన్నలగడ్డ వెంకటేశ్వర రావు, వీరారెడ్డి, ఉడుముల వెంగళ్ళ రెడ్డి, షేక్ జాకీర్, సుధాకర్, హైదర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి

రెంటపాళ్లలో ...

కలాం స్ఫూర్తిని కొనసాగించాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాలలో బుధవారం కలాం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, విద్యా కమిటీ చైర్మన్ సైదు ఖాసిం, ప్రధానోపాధ్యాయుడు కె.భానుమూర్తి, ఉపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, జయశ్రీ, బి. రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు పరిధిలో..

పెదకూరపాడు: కలాం బహుముఖ ప్రజ్ఞాశాలి అని పెద్దకూరపాడు, 75 తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు.

ఆర్సీఎం పాఠశాలలో...

అచ్చంపేట: భారతావని గర్వించదగిన మహోన్నత వ్యక్తి కలాం అని తాళ్లచెరువు ఆర్సీఎం స్కూల్ హెచ్‌ఎం తుమ్మా శౌర్రెడ్డి అన్నారు. కలాం జయంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. శౌర్రెడ్డి మాట్లాడుతూ కలాం కొత్త సాంకేతికతను అభివృద్ధి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరావతి పరిధిలో...



అమరావతి: కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అమరావతి: అబ్దుల్ కలాం ఆదర్శప్రాయులని తహసీల్దార్ డానియేల్ అన్నారు. బుధవారం కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో పాత్రికేయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలాం విగ్రహానికి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలాం చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. కలాం ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఎంపీడీవో పార్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలలను సాకారం చేసుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాలని సూచించారు. ఎంఈవోలు ప్రసాద్, శివ బాబు, ఆంగ్ల మీడియం హెచ్‌ఎం ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: యువతకు కలాం జీవితం ఆదర్శనీయమని ఎంపీడీవో సునీత తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవోపీఆర్డీ వెంకట గిరిరెడ్డి, ఏపీవో పాల్గొన్నారు.

నరసరావుపేట: కలాం జయంతిని పురస్కరించుకొని స్థానిక సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పల్నాడు జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ కంటమనేని రామచంద్రరావు, బలిజేపల్లి గురవయ్య పాల్గొన్నారు.



సత్తెనపల్లి: రెంటపాళ్లలో నివాళులు అర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెదకూరపాడు: జెడ్పీ పాఠశాలలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అచ్చంపేట: బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం శౌర్రెడ్డి



సత్తెనపల్లి: రైల్వేస్టేషన్‌రోడ్డులో స్వామి వివేకానంద చైతన్యభారతి ప్రతినిధుల నివాళులు

వరి రైతులకు సూచనలు



నకరికల్లు: వరిలో ఎండు ఆకుతెగులు నివారణకు నివారణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.వి.సత్యగోపాల్ సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని వరి పైరును శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ జిల్లా స్థాయి అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపైరు చిరుపొట్ట దశలో ఉన్నపుడు తెగుళ్లు, పురుగు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎండుతెగులు లక్షణాల నివారణకు ఎకరాకు 20కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా చల్లుకొని పొలంలోని నీటిని మురుగుకాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. రెండురోజుల తర్వాత మంచినీటిని పైరుకు పెట్టాలన్నారు. యూరియా, ఇతర ఎరువుల వాడకాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. ఆకుచుట్టు పురుగు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 400 గ్రాములు లేదా ఇండాక్స్ కార్బ్ 150 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం.నగేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు యు.ప్రియదర్శిని, సువిలా, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగవ్వాలి



సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులపై హరిత రాయబారులు సంపూర్ణ శ్రద్ధ వహించాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పరిశుభ్రత, పచ్చదనంపై హరిత రాయబారులకు, షెడ్ మిత్రాలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. శిక్షణలో భాగంగా గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చెల్లంచర్ల శ్రీనివాసరావు, కాల్వపల్లి అంజిరెడ్డి, చిలువూరి కృష్ణ ప్రసాద్‌లు మాస్టర్ ఆఫ్ ట్రైనర్లగా వ్యవహరించారు.

పేదలకు వైద్య సేవలు దూరం చేస్తున్న సర్కారు

నకరికల్లులో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ

నకరికల్లు: మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి పేదలకు వైద్య విద్య, ఉచిత వైద్యం అందనంత దూరం చేస్తున్నారని సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నకరిల్లులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. స్థానిక కొండయ్య గుడి సమీపంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభించారు. ప్రజలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా సంతకాలు చేస్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేదలపై కనికరం లేకుండా పోయిందన్నారు. ఫీజులు చెల్లించుకోలేని పేదవిద్యార్థులు ప్రతిభతో వైద్యవిద్యను అభ్యసించే అవకాశం కోల్పోతారన్నారు. పేదల కష్టనష్టాలు తెలిసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీలు తీసుకువస్తే నేడు కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్పొరేట్‌ల జేబులు నింపాలని చూస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసన వస్తోందన్నారు. పేదలకు వైద్యాన్ని, వైద్యవిద్యను దూరం చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీబాషా, సోషల్‌మీడియా స్టేట్ కార్యదర్శి పాలూరి రాజశేఖర్‌రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు బైరెడ్డి పరమేశ్వరరెడ్డి, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, రుసుం శ్రీనివాసరావు, సలీల్, పలు విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, భవనం రాఘవరెడ్డి తదితరులు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ


సత్తెనపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ అన్నారు. సత్తెనపల్లి మండలం పణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను పురస్కరించుకొని చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలన్నారు. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశామని, అధైర్య పడకుండా పాఠశాలకు పంపాలని విద్యార్థిని తల్లిదండ్రులకు ఆమె ధైర్యాన్ని నూరిపోశారు. సెమ్-2 పుస్తకాలు పంపిణీ చేశారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఏసుబాబు, సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి-1 ఏ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆషా, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు ఉన్నారు.



కలాం విగ్రహానికి నమస్కరిస్తున్న డీఈఓ చంద్రకళ

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

కారెంపూడి: కారెంపూడి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లును ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ల్యాబ్‌లో వైద్య పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి, ఫార్మసీ రూములో మందుల నిల్వలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పనితీరు బాగానే ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. గుండెపోటు లాంటి అత్యవసర కేసులు పీహెచ్‌సీకి వచ్చినప్పుడు అందించాల్సిన ప్రాథమిక చికిత్సలపై వైద్య సిబ్బంది అవగాహన పెంచుకుని వారికి ప్రాథమిక చికిత్స అందించి దగ్గరలోని పెద్ద హాస్పటల్స్‌కు పంపాలని సూచించారు. అనంతరం మేళ్లవాగు, గరికపాడు ఆరోగ్య ఉపకేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.హనుమ కుమార్, ప్రోగ్రాం మేనేజర్ ఎస్‌డీ ఉన్నూర్ బాషా, సీహెచ్‌వో మల్లయ్య పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

బెల్లంకొండ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాలలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖోఖో పోటీలకు విద్యార్థులు ఎంపిక



క్రోసూరు: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులు ఖోఖో పోటీలలో అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసూజన్ బుధవారం తెలిపారు. తమ విద్యార్థులు ఎం.సుధీర్, డి.శివ గణేష్‌లు ప్రతిభ చాటారని పేర్కొన్నారు. వారిని అభినందించారు.

ఎంప్లాయిస్ యూనియన్ నేతకు సత్కారం

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ వర్క్‌చార్జ్‌డు ఎంప్లాయిస్ స్టేట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జె.నాగేశ్వరరావుకు పట్టణంలోని ఎన్‌ఎస్పీ కార్యాలయ ఆవరణలో గల యూనియన్ కార్యాలయంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. సత్తెనపల్లి ఎన్‌ఎస్‌జెసీ ఓ అండ్ ఎం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.మురళీధర్, మేనేజర్ ఎంవీ సుబ్బారెడ్డిలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాలలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రంథశిరిలో శ్రీ మారుతి ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.3,92,000 విలువచేసే ఎరువులను, రూ.1,06,726 విలువచేసే పురుగు మందులను సీజ్ చేశారు. విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ, విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, అచ్చంపేట ఏవో పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పురుగు మందులను సీజ్ చేస్తున్న అధికారులు

ఔషధ 'మత్తు'తో ఎన్నో ఉపయోగాలు

- నొప్పి తెలియకుండా శస్త్రచికిత్సలకు అనస్తీషియా వైద్యం
- నేడు ప్రపంచ అనస్తీషియా దినం

సత్తెనపల్లి: రోగులకు శస్త్రచికిత్స చేయడంలో మత్తు మందు ఎంతో కీలకం. 1846 అక్టోబర్ 16న అమెరికాలోని మాసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్, దంత వైద్యుడు జాన్ కొలిన్స్‌తో కలిసి ఓ రోగికి తొలిసారిగా మత్తుమందు (ఈథర్ అనస్తీషియా) ఇచ్చి గొంతుకు శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనస్తీషియా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు వైద్యశాలల్లో కూడా పెద్ద సంఖ్యలో అనస్తీషియా వైద్యులు సేవలందిస్తున్నారు. ఆపరేషన్‌కు ముందు రోగికి నొప్పి తెలియకుండా మత్తుమందు ఇచ్చేది అనస్తీషియా వైద్యులే. రోగి త్వరగా కోలుకున్నాడంటే అందులో మత్తు వైద్యుని పాత్ర అధికంగా ఉంటుంది. ఇటీవల కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో నొప్పులు లేకుండానే ప్రసవాలు చేస్తున్నారు. దీనినే వైద్య పరిభాషలో పెయిన్ లెస్ లేబర్ అని పిలుస్తున్నారు.

పెయిన్ క్లినిక్‌ల కీలక పాత్ర..

దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స చేయడానికి పెయిన్ క్లినిక్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈ క్లినిక్స్‌లో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలను ఉపయోగించి కుట్లు లేని ప్రత్యేకమైన ఇంజక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. ఇందులో భాగంగా నడుము నొప్పికి, మోకాళ్ల నొప్పికి, మెడ నొప్పికి, తలనొప్పికి, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేస్తారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే నొప్పులకు లేబర్ అనస్తీషియా పద్ధతితో నొప్పిలేని కాన్పుగా చేస్తారు.



నరసరావుపేట ఏరియా వైద్యశాల ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ చేస్తున్న వైద్యులు

అనస్తీషియా లేకపోతే శస్త్రచికిత్స కష్టం



వైద్యరంగంలో అనస్తీషియా పాత్ర చాలా కీలకం. ఈ మందు లేకపోతే ఏంటని ఊహించడమే కష్టం. అనస్తీషియా మందు రావడంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి.సాధారణ అనస్తీషియాలో రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు. వారు ఎలాంటి అనుభూతికి లోనవ్వరు. శ్వాస తీసుకోవడం, ఐవీ ద్వారా ఔషధాన్ని స్వీకరించడం మాత్రం మామూలే. అనస్తీషియా విధానంతో అనేక రకాల శస్త్ర చికిత్సలు చేయడం సాధ్యం.

–డాక్టర్ ఎ. వెంకట్రావు, సివిల్ సర్జన్, ఏరియా వైద్యశాల, నరసరావుపేట

పేకాట రాయుళ్ల అరెస్ట్

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్ఐ ఎల్.సుధీర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గోలి గ్రామంలో ఓ నివాసంపై పోలీసు సిబ్బందితో దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5,040 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా, తెలంగాణ మద్యం విక్రయిస్తున్నా, సరఫరా చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు.